RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 244 | పేజీలు : 08 | ఆదివారం | 13-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు



2

- రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకూడదు: రాజాసింగ్
- హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ చేయడానికి నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతించిన రాజాసింగ్
- నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వాములు చేయాలని విన్నపం

## 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం: శ్రీధర్ బాబు
- హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు
- దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి
- హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి



2

## బీఆర్ఎస్ నేతలపై కేసులు..

మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?: కేటీఆర్

- బీఆర్ఎస్ నేతలపై కేసులపై కేటీఆర్ స్పందన
- కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటామని వెల్లడి
- మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై డీజీపీకి ప్రశ్న
- తెలంగాణ పోలీసులు నిందితులను కాపాడుతున్నారా? అని నిలదీత
- మిల్లా మ్యాగీ ఆరోపణలతో గతంలో రాజకీయ దుమారం

2






## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా


2

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ పల్స్,డెస్క్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని




# అన్ని సౌకర్యాలు అందిస్తాం

గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు.ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

హైదరాబాద్ పల్స్,డెస్క్

గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ

2

## భక్తితో గణనాథుడిని పూజిద్దాం

గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు.



## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ...

కొండా సురేఖ తొలగింపుపై తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు

- తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహించిన బీఆర్ఎస్
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు
- మాజీ మంత్రి కొండా సురేఖ తొలగింపుపై తలసాని సెటైర్లు
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్
- అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు.ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్

## పనులు వేగవంతమయ్యాయి

- ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి: కిషన్ రెడ్డి
- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి

2




## ట్రెండ్ ఫాలో అవుతున్నారా..

1980ల రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్ ఫాలో అవుతున్నారా..అయితే జాగ్రత్త..

హైదరాబాద్ పల్స్,డెస్క్

సోషల్ మీడియాలో ప్రస్తుతం 1980ల రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్ వైరల్‌గా మారింది. చాలా మంది తమ ఫొటోలను 1980 దశకం నాటి ఫొటోలుగా మార్చుకుని సంబరపడిపోతున్నారు. అయితే, ఈ ట్రెండ్‌ను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు

2





2

## చట్టసభలపై నమ్మకం లేదా.?

కేసీఆర్..మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే చట్టసభలపై నమ్మకం లేదా.?: మంత్రి సీతక్క

హైదరాబాద్ పల్స్,డెస్క్

బీఆర్‌ఎస్‌పై తెలంగాణ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నిర్వహించింది మాక్ అసెంబ్లీ కాదని.. డెమోక్రసీని గులాబీ పార్టీ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు. ఈరోజు (శనివారం) అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి సీతక్క చిట్‌చాట్ చేశారు. ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ఎల్పీ మీటింగ్ నిర్వహించి, ఆ పార్టీ

# బ్రిక్స్ సదస్సు

జిన్‌పింగ్‌కు రామేశ్వరం ఆలయ విశిష్టతను వివరించిన మోదీ

- ఢిల్లీలోని భారత్ మండపంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రారంభం
- ప్రపంచ నేతలకు స్వాగతం పలికే వేదికపై రామేశ్వరం ఆలయ చిత్రం
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆలయ ప్రాముఖ్యతను వివరించిన ప్రధాని మోదీ
- మానవతే ప్రథమం స్ఫూర్తితో భారత్ అధ్యక్షత వహిస్తోందని వెల్లడి
- బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదని, అందరినీ కలుపుకొని పోవాలని మోదీ పిలుపు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు హాజరైన ప్రపంచ దేశాల అధినేతలకు ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా స్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమానికి తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం చిత్రాన్ని బ్యాక్‌డ్రాప్‌గా

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

మొదటి పేజీ రువాయి

పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు.పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

మొదటి పేజీ రువాయి

ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, “కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?” అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. “100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా” అంటూ ఎద్దేవా చేశారు.తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

# అన్ని సౌకర్యాలు అందిస్తాం

మొదటి పేజీ రువాయి

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్‌కు అందించాలని సూచించారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

**మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి**

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ హాజరయ్యారు.

మొదటి పేజీ రువాయి

# పనులు వేగవంతమయ్యాయి

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు.ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు.గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా ‘క్యూర్ యాక్ట్- 2026’ శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ‘తెలంగాణ రైజింగ్ 2047’ పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు.చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు.ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

# బ్రిక్స్ సదస్సు

మొదటి పేజీ రువాయి

ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్-సిసి, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్ వంటి నేతలకు ప్రధాని స్వాగతం పలికారు. ముఖ్యంగా, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కరచాలనం చేసిన మోదీ, ఆయనకు బ్యాక్‌డ్రాప్‌గా ఉన్న రామేశ్వరం ఆలయ ప్రాముఖ్యతను, దాని చారిత్రక విశిష్టతను క్లుప్తంగా వివరించారు. ఇతర నేతలతోనూ ఆయన ముచ్చటిస్తూ భారతీయ సాంస్కృతిక వైభవాన్ని తెలియజేశారు.తమిళనాడులోని పంబన్ ద్వీపంలో ఉన్న రామనాథస్వామి ఆలయం హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. శివుడికి అంకితం చేయబడిన 12 జ్యోతిర్లింగాలలో ఇది కూడా ఒకటి. అద్భుతమైన వాస్తుశిల్పం, విశాలమైన కారిడార్లతో ఈ ఆలయం భక్తి, సంస్కృతి, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. రామాయణంతో ఈ ఆలయానికి ప్రత్యేక అనుబంధం ఉంది.శని, ఆదివారాల్లో జరుగుతున్న ఈ సదస్సుకు భారత్ అధ్యక్షత వహిస్తోంది. ప్రారంభ సెషన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ, ‘మానవతే ప్రథమం’ అనే స్ఫూర్తితో, ప్రజాకేంద్రీకృత విధానంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతే తమ ప్రాధాన్యతలని స్పష్టం చేశారు. ఈ దార్శనికతతోనే దేశంలోని 30 నగరాల్లో 350కి పైగా సమావేశాలు నిర్వహించి, బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానం చేశామని ఆయన వివరించారు.బ్రిక్స్ కూటమి ప్రపంచ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుందని ప్రధాని అన్నారు. బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదని, అందరినీ కలుపుకొనిపోయే విధానంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్ నిర్ణయాల కొనసాగింపు, అమలు కోసం ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు. ఇక ఇదే వేదికపై మోదీ.. పుతిన్, జిన్ పింగ్ లతో ఉల్లాసంగా ముచ్చటించిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి

# చట్టసభలపై నమ్మకం లేదా.?

మొదటి పేజీ రువాయి

ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే గులాబీ పార్టీ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆగ్రహించారు.

**బీఆర్ఎస్‌ది ఆధిపత్య దురంహంకారం..**

ఇంకా ఆ మైలపోలేదనే ఆధిపత్య దురంహంకారంతో ఆ పార్టీ నేతలు ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్... మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభలపై ,సొంత పార్టీ కార్యక్రమంపై ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. అధికారంలో ఉంటే సచివాలయానికి రారని.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి కూడా రారా అని నిలదీశారు. ఫాంహౌస్‌ని సచివాలయంగా.. పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు.

**స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్నారు..**

ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ పెట్టడమంటే వారు ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా అధికారం పోయినా.. దొర అహంకారం ఇంకా పోలేదని ఎద్దేవా చేశారు. స్పీకర్‌ను, చట్ట సభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## కేసీఆర్ నా సూచనలు

# పట్టించుకోలేదు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ శాసనసభలో ‘కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు’ పై జరిగిన చర్చ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆయన... శాసనసభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లేదా ప్రజా సమస్యలపై సూచనలు చేసినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ... ఆ నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలకు తగిన భాగస్వామ్యం కల్పించాలని కోరారు.గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ కూడా హైదరాబాద్‌ను గొప్పగా అభివృద్ధి చేయాలని భావించినప్పటికీ... హైదరాబాద్ ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశాలు పెట్టాలని తాను ఇచ్చిన సూచనలను ఆయన పట్టించుకోలేదని రాజాసింగ్ గుర్తుచేశారు. ఇప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకుండా, నగర పరిధిలోని ఎమ్మెల్యేలందరితో కలిసి ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని కోరారు.హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే ముందుగా బస్తీలు, గల్లీలలో ఉన్న ప్రాథమిక సమస్యలు తీరాలని రాజాసింగ్ పేర్కొన్నారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల మధ్య తీవ్ర అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని... మంచినీటి సరఫరా ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని సభ దృష్టికి తెచ్చారు. కొన్ని ప్రాంతాలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటలకు నీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు నిద్రలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తగినంత రవాణా, డ్రైనేజీ సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించకుండానే బహుళ అంతస్తుల (హైరైజ్) భవనాలకు అనుమతులు ఇవ్వడం వల్ల సమస్య మరింత సంక్లిష్టంగా మారుతోందని విమర్శించారు.

# బీఆర్ఎస్ నేతలపై కేసులు..

మొదటి పేజీ రువాయి



అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు.“ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి?” అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు.అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళం నేపథ్యంలో ముఖ్యమంత్రి తన పోలీసులతో బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు.2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఆరోపించారు. “మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదు. ఇవేం పోటీలు?” అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.తనకు ఎదురైన అసౌకర్యంతో మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మ్యాగీ అర్ధాంతరంగా వైదొలిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్న తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.



# ట్రెండ్ ఫాలో అవుతున్నారా..

మొదటి పేజీ రువాయి

పాల్పడే అవకాశం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.సాధారణ ఫొటోలను 1980ల నాటి రెట్రో ఫొటోలుగా మార్చుతామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నారని శిఖా గోయల్ తెలిపారు. ఉచితంగా లేదా అపరిమితంగా ఎడిటింగ్ సదుపాయం కల్పిస్తామంటూ నమ్మబలుకుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సైబర్ కేటుగాళ్లు పంపే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేస్తే ప్రమాదం తప్పదని ఆమె హెచ్చరించారు. అలాంటి లింకులను ఓపెన్ చేస్తే ఏపీకే ఫైళ్ల ద్వారా నిందితులు మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఎస్ఎంఎస్, ఓటీపీ, కాంటాక్టులు, బ్యాంకింగ్, ఆర్థిక, వ్యక్తిగత సమాచారం సహా మొబైల్‌లో భద్రపరిచిన ఇతర సున్నితమైన సమాచారాన్ని నిందితులు దొంగిలించే అవకాశం ఉందన్నారు.దీని ద్వారా ఆర్థిక మోసాలు, అనధికారిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉందని శిఖా గోయల్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఎస్, వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి నేరాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఎఎఎవతీఎతీఱఎవ.గ్రశీఙ.ఱఅ, వాట్సాప్ నంబర్ 8712672222కు ఫిర్యాదు చేయాలని శిఖా గోయల్ తెలిపారు.

# విద్యతోనే ఏదైనా సాధ్యం - భద్రాచలం వాసి కొసరాజు రామ్మోహన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 12, భద్రాద్రి కొత్తగూడెం:**
విద్యార్థులు చదువుకొని ప్రయోజకులు కావాలని, ఇందుకు గాను ఇప్పటి నుండే ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలని భద్రాచలం పట్టణానికి చెందిన కొసరాజు రామ్మోహన్ పిలుపునిచ్చారు.తన మనవడు కొసరాజు గోపికృష్ణ – శైలజ దంపతుల కుమారుడు సాయి గగన్ జన్మదినం సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం, శబరి బాలికా నిలయ విద్యార్థులకు స్టీల్ భోజన ప్లేట్స్, పండ్లు, పెన్నులు, బిస్కట్స్‌ను పంపిణీ చేశారు.వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామ్మోహన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలని" ఆకాంక్షించారు."తాము ఏమి కావాలో చిన్ననాటి నుండే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు" అని ఆయన అన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తమను ఎంతగానో ఆకట్టుకుందని, అందుకే మనవడి జన్మదినం సందర్భంగా ఈ వితరణ అందించినట్లు



తెలిపారు.ప్రతి ఒక్కరూ చదువులపై శ్రద్ధ పెట్టి సంస్థతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ, వనవాసీ విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరుచుకొని దాతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు."విద్యతోనే వినయం, విధేయత వస్తుంది. కుటుంబంలో ఒక్కరు చదువుకొని జీవితంలో స్థిరపడితే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుంది" అని ఆయన తెలిపారు.వనవాసీ సంస్థ ఏ ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం పొందదని, కేవలం దాతల ద్వారానే నడుస్తుందన్నారు. గిరిజనుల సంక్షేమం, విద్యార్థుల అభ్యున్నతి కొరకు పాటుపడే సంస్థకు దాతలు తమవంతు సహకారమందించి విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు.

**శబరి బాలికలకు దుస్తుల పంపిణీ**

వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని చర్లలోని వనవాసీ శబరి బాలికా విద్యార్థి నిలయ బాలికలకు వస్త్ర వ్యాపారి గుండెల రమేష్ – రత్నకుమారి దంపతులు దుస్తులను పంపిణీ చేశారు.శనివారం కొమరం భీం విద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో వనవాసీ తరపున మొట్టమొదటి బాలికా విద్యార్థి నిలయం చర్లలో ప్రారంభించామని తెలిపారు.గిరిజన విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధికి వనవాసీ అనేక సేవా కార్యక్రమాలను చేస్తోందని, ఇందులో భాగంగానే బాలికల కొరకు వసతి గృహం ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు.విద్యార్థులు ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ దంపతులతో పాటు గోగికార్ రాంలక్ష్మణ్, వరలక్ష్మి, సంతోష్ పాల్గొన్నారు.

# దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

## తాత మధుపై మండిపడ్డ నర్సింహారెడ్డి





**జహీరాబాద్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
అసెంబ్లీ స్పీకర్‌గా గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి తీవ్రంగా ఖండించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి అత్యంత గౌరవం, హోదా ఉంటుందని తెలిపారు."అలాంటి ఉన్నత స్థానంలో ఉన్న దళిత బిడ్డపై వ్యక్తిగతంగా అవమానకర వ్యాఖ్యలు చేయడం తాత మధు రాజకీయ సంస్కారానికి అద్దం పడుతోంది" అని ఆయన మండిపడ్డారు.రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. అధికారాన్ని కోల్పోయిన అక్కసుతో రాజ్యాంగబద్ధ పదవులపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం ప్రజలు సహించరని హెచ్చరించారు."దళిత సమాజానికి చెందిన వ్యక్తి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా అత్యున్నత స్థానంలో ఉండటాన్ని జీర్ణించుకోలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా?" అని నర్సింహారెడ్డి ప్రశ్నించారు. స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలకు తాత మధు వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎం.పి.పి రాములు, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, సర్పంచ్‌లు బి.రవి, నరేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహులు, దిలీప్ కుమార్, రాజు, సురేష్ 'హోతి బి', సుభాష్ రెడ్డి, దిడ్గి సురేష్, రాయిపల్లి డి సంజీవరెడ్డి, సంజీవ్, ఇమామ్ పటేల్, నాగరాజు, జగన్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరు

**సెప్టెంబర్ 12, హైదరాబాద్(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
మహానగరంలో గణేశ్ ఉత్సవాలను ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి దానం నాగేందర్‌లతో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరయ్యారు.గణేశ్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు.జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ, హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సురక్షితంగా మరియు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకుతావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.



# మాక్ అసెంబ్లీ కాదు.. రాజకీయ నాటకాలు: ఎంపీ చామల


**అసెంబ్లీకి రాకుండా బయటే ఆందోళనలు చేస్తున్నారని విమర్శ**

**వచ్చే రెండేళ్లు కూడా ఇలాగే నాటకాలు ఆడాల్సిందేనంటూ వ్యంగ్యాస్త్రాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):**
బీఆర్ఎస్ నాయకులు శాసనసభకు హాజరుకాకుండా మాక్ అసెంబ్లీ నిర్వహించడం రాజకీయ నాటకాల్లో భాగమేనని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రజలు ఆ పార్టీని నమ్మడం లేదని, అందుకే కొత్త నాటకానికి తెరతీశారని ఎద్దేవా చేశారు. వచ్చే రెండేళ్లు కూడా ఇలాగే నాటకాలు వేసుకుని బతకాల్సిన పరిస్థితి బీఆర్ఎస్ నేతలకు ఉందని వ్యాఖ్యానించారు.శాసనసభా పక్ష సమావేశంలోనే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో గొడవలు సృష్టించేలా కేసీఆర్ దిశానిర్దేశం చేశారని చామల ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు.నల్ల టీషర్టులపై పేర్లు రాసుకుని అసెంబ్లీకి వస్తే భద్రతా సిబ్బంది అనుమతించరనే విషయం ముందే తెలిసి, అసెంబ్లీ గేటు వద్ద పోలీసులతో గొడవకు దిగారని ఆరోపించారు. సభలోకి వచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా బయటే ఆందోళనలు చేస్తూ సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు.బీఆర్ఎస్ నేతలు దళితులను, శాసనసభ స్పీకర్ పదవిని అవమానించేలా వ్యవహరించారని చామల విమర్శించారు. ఇది వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.

**"సురభి నాటక మండలిలో చేరొచ్చు'**

మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిపైనా చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి, మంత్రులను వ్యక్తిగతంగా దూషిస్తూ, వెకిలి చేష్టలతో కాలయాపన చేశారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై వారికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను పక్కనపెట్టి ప్రజాస్వామ్య వ్యవస్థలను ఎగతాళి చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని చామల అన్నారు. మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న నేతలు రాజకీయాల కంటే సురభి నాటక మండలిలో చేరితేనే బాగుంటుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.





# ఉత్తమ ఉపాధ్యాయుడిగా సంగారెడ్డికి అవార్డు.. ఘన సన్మానం

**వడ్డి పాఠశాల అభివృద్ధిలో విశేష సేవలు**

**విద్యార్థుల తీర్చిదిద్దడంలో ప్రశంసనీయ కృషి**

**న్యాల్కల్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
న్యాల్కల్ మండల పరిధిలోని వడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగారెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించిన జిల్లా అధికారులు ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు సంగారెడ్డిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను విద్యతో పాటు క్రమశిక్షణ, సృజనాత్మకత, సామాజిక విలువలతో తీర్చిదిద్దడంలో ఆయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది చేస్తున్న కృషిని కొనియాడారు.వడ్డి ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సంగారెడ్డి అందించిన సేవలు అభినందనీయమని, ఆయన కృషి తోటి ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అవార్డు అందుకున్న సంగారెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువనాయకుడు ఆనందీశ్వర్ పాల్గొన్నారు.

# బ్రిక్స్ సదస్సు : పాశ్చాత్యదేశాలకు మోడీ క్లారిటీ..! బ్రిక్స్ వ్యతిరేకతకు దూరంగా..!




**ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతాం.. ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలు అవసరం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
బ్రిక్స్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకంగా పనిచేయడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే భారత్ లక్ష్యమని తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో భారత్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమాలు ప్రజలే కేంద్రంగా, మానవాళికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చే విధంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.దృఢత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతను భారత్ ప్రధాన ప్రాధాన్యతలుగా నిర్ణయించిందని మోదీ తెలిపారు. బ్రిక్స్ సభ్య దేశాలు పరస్పరం భిన్నమైన అభిప్రాయాలను గౌరవిస్తూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు.ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలు అవసరమని మోదీ పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో అధికారం, ప్రత్యేకాధికారాల ఆధారిత వ్యవస్థను భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ తీసుకునే నిర్ణయాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.అభివృద్ధి చెందుతున్న దేశాలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ సభ్య దేశాలకు మోదీ సూచించారు.

హైదరాబాద్ పల్స్

# సింగాటం గ్రామ ప్రజల సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**సింగాటం, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** సింగాటం గ్రామంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దోమల బెడద పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడి పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పరిస్థితి నెలకొంది.కావున గ్రామ సర్పంచ్ వెంటనే స్పందించి, గ్రామ పంచాయతీకి సంబంధించిన దోమల మందు పిచికారీ చేసే యంత్రాన్ని బాగు చేయించి, గ్రామంలోని అన్ని కాలనీలు, వీధుల్లో దోమల మందు పిచికారీ చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు**

గ్రామంలో బడి మరియు కళాశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం గతంలో ఉండేది. ప్రస్తుతం బస్సు గ్రామంలోకి రావడానికి రహదారి వెంట ఉన్న కొన్ని చెట్లను తొలగించాల్సిన పరిస్థితి ఉందని, ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో బస్సు సౌకర్యం నిలిచిపోయిందని తెలుస్తోంది.దీంతో ప్రతిరోజూ బడి, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు గ్రామ ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల సమస్యను నిబంధనల ప్రకారం పరిష్కరించి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సేవను తిరిగి సింగాటం గ్రామం వరకు నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

**పారిశుధ్య సమస్యలు**

గ్రామ పంచాయతీ చెత్త బండి వారానికి ఒక్కసారి మాత్రమే రావడంతో గ్రామంలో చెత్త పేరుకుపోయి పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. చెత్త బండికి డీజిల్ పోయడానికి కూడా నిధులు లేవని సర్పంచ్ చెబుతున్న పరిస్థితి ఉంది.

**ప్రజల డిమాండ్లు**

గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి:
దోమల మందు పిచికారీ యంత్రాన్ని బాగు చేయాలి.
గ్రామమంతటా దోమల మందు పిచికారీ చేయాలి.
చెత్త సేకరణను క్రమం తప్పకుండా నిర్వహించాలి.
చెత్త బండికి అవసరమైన డీజిల్ అందుబాటులో



ఉండేలా చర్యలు తీసుకోవాలి.
రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల సమస్యను నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.
బడి, కళాశాల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సేవను సింగాటం గ్రామానికి తిరిగి ప్రారంభించాలి.ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చిట్కుల్ వార్డు కార్యాలయంలో ప్రత్యేక ఎస్ఐఆర్ ప్రచార కార్యక్రమం

**ఓటర్లకు అవగాహన కల్పించిన బీఎల్ఓలు**

**ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన**

**పటాన్చెరు, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రెండో దశ ప్రత్యేక ఎస్ఐఆర్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిట్కుల్తో పాటు పలు వార్డు కార్యాలయాల్లో బీఎల్ఓల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్నికల అధికారులు ఆదేశించారు. ఇందులో భాగంగా లగ్దారం, రుద్రారం, చిట్కుల్, పాశమైలారం తదితర వార్డు కార్యాలయాల్లో సంబంధిత బీఎల్ఓలతో కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఓటర్లకు




ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, ఓటర్ల జాబితాలో వివరాల పరిశీలన, అవసరమైన మార్పులు, సవరణలకు సంబంధించిన అంశాలను వివరించారు.పటాన్చెరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్రావు, మనోహర్రెడ్డి, బీఎల్ఓల పర్యవేక్షకుడు, మున్సిపల్ మేనేజర్ టీ. పృథ్వి తదితరులు పలు వార్డు కార్యాలయాలను తనిఖీ చేసి కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు.ప్రజలు ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

# జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత వినాయక విగ్రహం

**త్రివేణి కిడ్స్లో ఘనంగా వినాయక చవితి వేడుకలు**

**పర్యావరణ పరిరక్షణపై చిన్నారులకు అవగాహన**

**రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** బీరంగూడలోని త్రివేణి కిడ్స్ పాఠశాల శాఖలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.వేడుకల్లో డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్వో సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ భవాని, క్యాంపస్ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత వినాయక విగ్రహాన్ని రూపొందించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వంటి పర్యావరణానికి హానికరమైన పదార్థాలకు బదులుగా సహజసిద్ధమైన జ్యూట్ను వినియోగించి చిన్నారులు వినూత్నంగా విగ్రహాన్ని తయారు చేశారు. పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు ప్రకృతిని పరిరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ఈ ప్రయత్నం అందించింది.వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తల్లిదండ్రులు కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించి విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ చిన్న వయసు నుంచే




విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, బాధ్యతాయుత జీవన విధానం, భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగలను సంప్రదాయబద్ధంగా, ఆనందంగా నిర్వహించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడే విధానాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.

# చిన్నారులకు పునర్జన్మ.. 19 గుండె శస్త్రచికిత్సలు విజయవంతం!

**నిమ్స్ ప్రత్యేక శిబిరంలో క్లిష్టమైన శస్త్రచికిత్సలు**

**రెండు కిలోల పసికందుకు సైతం విజయవంతంగా ఆపరేషన్..**

**వైద్య బృందానికి సీఎం అభినందనలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** పుట్టుకతోనే గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు నిమ్స్ వైద్యులు కొత్త జీవితాన్ని అందించారు. నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు నిర్వహించిన ప్రత్యేక గుండె శస్త్రచికిత్సల శిబిరంలో 19 మంది చిన్నారులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు.క్లిష్టమైన గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు అత్యున్నత వైద్య సేవలు అందించి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన నిమ్స్ వైద్య బృందాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. తక్కువ వయస్సు, తక్కువ బరువు ఉన్న చిన్నారులకు సైతం క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం పట్ల వైద్యులను ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ శిబిరంలో కేవలం రెండు కిలోల బరువున్న రెండు నెలల పసికందుకు గుండె శస్త్రచికిత్స నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. అత్యంత తక్కువ వయస్సు, బరువు కారణంగా శస్త్రచికిత్స సవాల్గా ఉన్నప్పటికీ వైద్యులు అత్యంత జాగ్రత్తగా చికిత్స అందించి విజయవంతంగా పూర్తి చేశారు.శిబిరం ముగిసిన అనంతరం వైద్యులు డాక్టర్ డి. రమణ ధన్నపునేని, డాక్టర్ ఎం. అమరేష్ రావు ముఖ్యమంత్రిని



కలిసి శస్త్రచికిత్సల వివరాలను వెల్లడించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వైద్య సేవలు అందించిన వైద్యులు, సిబ్బందిని సీఎం అభినందించారు.ప్రభుత్వ వైద్య సంస్థల్లో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించగల సామర్థ్యం ఉందని ఈ శిబిరం మరోసారి నిరూపించిందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులకు అందుబాటులో అత్యున్నత వైద్య సేవలు అందించడం నిమ్స్లోని ప్రత్యేక వైద్య విభాగాల ప్రాధాన్యాన్ని చాటుతోంది.పుట్టుకతో వచ్చే గుండె సమస్యలను సకాలంలో గుర్తించి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించడం అత్యంత కీలకమని వైద్యులు సూచిస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రత్యేక శిబిరాల ద్వారా మరింత మంది చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ పాల్గొన్నారు.




## చిన్నారుల సృజనలో మట్టి గణపయ్యలు

**లిటిల్ మైండ్స్ హైస్కూల్లో భక్తిశ్రద్ధలతో గణేష్ చతుర్థి వేడుకలు**

**పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన విద్యార్థులు**

**డోర్నకల్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని లిటిల్ మైండ్స్ హైస్కూల్లో గణేష్ చతుర్థి వేడుకలను విద్యార్థులు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. గణేష్ చతుర్థిని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులతో మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించారు.ప్రిన్సిపల్ గోగుల మల్సూర్, కరస్పాండెంట్ మహేశ్వరి విద్యార్థులను ప్రోత్సహిస్తూ మట్టి గణపతుల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు తమ చిట్టి చేతులతో మట్టిని మలుస్తూ వివిధ ఆకృతుల్లో గణపతి ప్రతిమలను రూపొందించారు. అనంతరం తాము తయారు చేసిన మట్టి గణపతులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.పండుగ సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. మట్టి విగ్రహాల తయారీ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, కళా నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని గణేష్ చతుర్థి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.



## ట్రంప్ కు చిర్రెత్తుకొచ్చే ఫొటో..! ఒకే ఫ్రేమ్ లో మోడీ-పుతిన్-జిన్ పింగ్ ..!


**బ్రిక్స్ వేదికగా ప్రపంచానికి కీలక సంకేతం**

**ముగ్గురు నేతల కలయికపై అంతర్జాతీయంగా ఆసక్తి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్ ఒకే ఫ్రేమ్లో కనిపించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ముగ్గురు నేతలు పరస్పరం చేతులు కలుపుతూ, చిరునవ్వులతో కనిపించిన దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అమెరికా, పాశ్చాత్య దేశాలతో రష్యా, చైనాలకు కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో ఈ ముగ్గురు నేతల కలయికకు ప్రాధాన్యం ఏర్పడింది. బ్రిక్స్ వేదికగా భారత్ మాత్రం ఎవరికి వ్యతిరేకంగా పనిచేయడం లేదని, అన్ని దేశాలతో సహకారానికి ప్రాధాన్యం ఇస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.బ్రిక్స్ కూటమిలో భారత్, రష్యా, చైనాల మధ్య సహకారం మరింత బలపడుతున్న సంకేతంగా ఈ భేటీని అంతర్జాతీయ పరిశీలకులు చూస్తున్నారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ పరిణామంపై ఎలా స్పందిస్తారన్న అంశంపై కూడా ఆసక్తి నెలకొంది.ప్రపంచ రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాల మధ్య మోదీ--పుతిన్--జిన్పింగ్ ఒకే వేదికపై కనిపించడం బ్రిక్స్ ప్రాధాన్యాన్ని మరింత పెంచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.







# 574 కేసులకు ఒక్కరోజులో చెక్ పెట్టిన లోక్ అదాలత్.. ఖేడ్‌లో సంచలన పరిష్కారం!

**కక్షిదారుల పరస్పర అంగీకారంతో కేసుల పరిష్కారం..**

**సమయం, ఖర్చు ఆదా**

**న్యాయమూర్తి హిమబిందు**

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నారాయణఖేడ్ పట్టణంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం. హిమబిందు సమక్షంలో వివిధ కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీమార్గంలో పరిష్కరించారు. ఈ సందర్భంగా మొత్తం 574 కేసులు రాజీ ద్వారా పరిష్కారమైనట్లు న్యాయమూర్తి ఎం. హిమబిందు తెలిపారు. కక్షిదారులు పరస్పర అవగాహనతో ముందుకు రావడం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు. సమయం, ఖర్చు ఆదా చేసుకుని సత్వర న్యాయం పొందేందుకు లోక్ అదాలత్ మంచి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా, వేగంగా న్యాయం అందించాలనే ఉద్దేశంతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సబ్ డివిజన్ ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోవాలి: మాజీ కార్పొరేటర్

**ఓల్డ్ బోయిన్‌పల్లి వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ.**

**ఓటరు జాబితాలో పేరు, వివరాలు సరిచూసుకోవాలని ముద్దం నర్సింహ యాదవ్ సూచన**



**ఓల్డ్ బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** ఓల్డ్ బోయిన్‌పల్లి వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించి, ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వాములు కావాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. "ఓటు మన హక్కు.. మన భవిష్యత్తుకు బలం. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలి" అని ముద్దం నర్సింహ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి హరినాథ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# నిమ్స్‌లో అరుదైన ఘనత..

**వైద్యులను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 12
: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిమ్స్ వైద్యులు శనివారం కలిశారు. నిమ్స్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా వైద్యులు డి.రమణ ధన్నపునేని, ఎం.అమరేశ్ రావు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ క్యాంపును నిర్వహించారు. పుట్టుకతో గుండె జబ్బులతో బాధపడుతున్న 19 మంది చిన్నారులకు క్యాంపులో శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో కేవలం 2 కిలోల బరువు ఉన్న 2 నెలల పసికందుకి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి వైద్యులను అభినందించారు.

# "పచ్చదనం పెంచితేనే.. భావితరాలకు భవిష్యత్తు"

**వనమహోత్సవంలో మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్**

**మచ్చబొల్లారం, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** జీవకోటి మనుగడకు ప్రాణవాయువు ఎంతో ముఖ్యమని, వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు పెద్ద ఎత్తున చెట్లు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ పిలుపునిచ్చారు. మచ్చబొల్లారం పరిధిలోని విజయ్ విహార్ కాలనీలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, 191వ డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి సురేందర్ రెడ్డి, 190వ డివిజన్ అధ్యక్షుడు లడ్డు రెడ్డి (నరేందర్ రెడ్డి), కాలనీ అధ్యక్షుడు చెరుకు నరేష్ రెడ్డితో కలిసి కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజ్ జితేంద్రనాథ్ మాట్లాడుతూ రోజురోజుకూ చెట్ల సంఖ్య తగ్గిపోతుండటం



ఆందోళనకరమన్నారు. చెట్లు స్వచ్ఛమైన గాలి, ప్రాణవాయువు, నీడను అందించడంతో పాటు వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో, వన్యప్రాణుల సంరక్షణలో, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వేగవంతమైన పట్టణీకరణ, అటవీ నిర్మూలన కారణంగా పచ్చని ప్రాంతాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. "చెట్లు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆనంద్ రెడ్డి, బాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సంపత్, శ్రీనివాస్, అలోక్ రెడ్డి, సాయికిరణ్, సందీప్, వెంకటేష్, రవీందర్, నవనీత్, ప్రసాద్, కృష్ణారావు, నాగరాజు, వెంకటేశ్వర్లు, భరత్, రఘు, దేవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేపట్టిన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల దరఖాస్తు తేదీ ఈనెల 15 వరకు పొడిగింపు

**ఒక ప్రజా ప్రకటనలో తెలిపిన టేకూర్ గ్రామ సర్పంచ్ సంగీత నాగేశ్వర్**

**న్యాల్కల్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు టేకూర్ గ్రామ సర్పంచ్ సంగీత నాగేశ్వర్ తెలిపారు. అర్హులైన మహిళలు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. దరఖాస్తుదారుల వయసు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. నిరుద్యోగులు, నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలు, టైలరింగ్ శిక్షణ ధ్రువపత్రం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు నివాస, కుల, ఆదాయ, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని తెలిపారు. కనీస అక్షరాస్యత తప్పనిసరి కాగా, దరఖాస్తులు అధికంగా వస్తే కనీసం ఐదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023--24 ఆర్థిక సంవత్సరంలో బీసీ పథకం కింద ఇప్పటికే లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని సర్పంచ్ స్పష్టం చేశారు. అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల 15లోపు



దరఖాస్తు చేసుకోవాలని సంగీత నాగేశ్వర్ కోరారు.

# సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు డీజేలకు అనుమతి లేదు

**గణేష్ మండపాల సమన్వయ సమావేశంలో డీసీపీ బి. రామ్ రెడ్డి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

**గోదావరిఖని, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో భాగంగానే డీజే వినియోగంపై నిషేధం అమల్లో ఉందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో కోదండ రామాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏసీపీ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ డీజే శబ్దం ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా గుండె సంబంధిత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున డీజేలను వినియోగించరాదన్నారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రలో నిర్వాహకులు ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గోదావరిఖని ప్రజలు ఎప్పటికప్పుడు పోలీస్ శాఖకు సహకరిస్తూ నిబంధనలను పాటిస్తున్నారని డీసీపీ తెలిపారు. వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న ప్రజలు స్థానిక ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ఐకమత్యంగా జీవిస్తున్నారని, అందుకే గోదావరిఖనికి 'మినీ మాంచెస్టర్'గా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అదే స్ఫూర్తితో గణేష్ నిమజ్జనాన్ని కూడా ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించాలని కోరారు. నిమజ్జన శోభాయాత్రను వీలైనంత త్వరగా ప్రారంభించి, మధ్యాహ్నం ప్రారంభిస్తే సాయంత్రం 5 లేదా 6 గంటలలోపు ప్రధాన చౌరస్తాకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అక్కడి నుంచి గోదావరి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతానికి క్రమపద్ధతిలో శోభాయాత్ర కొనసాగించాలని తెలిపారు.

**మండప నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సినవి**

మండపాలను వివాదాస్పద స్థలాల్లో, ఇతర మతాలకు చెందిన స్థలాల్లో లేదా ప్రార్థనా మందిరాలకు ఆనుకుని ఏర్పాటు చేయరాదని పోలీసులు సూచించారు. రహదారులకు అడ్డంకిగా మండపాలు ఏర్పాటు చేయకుండా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. మండపాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే ఏర్పాటు చేయడంతో పాటు నాణ్యమైన విద్యుత్ వైర్లను మాత్రమే వినియోగించాలని, అనధికారిక విద్యుత్ కనెక్షన్లు, వైర్ల అతుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి మండప ఏర్పాటుపై సమాచారం అందించాలని తెలిపారు. మండపం వద్ద కనీసం ఇద్దరు నిర్వాహకులు నిరంతరం పర్యవేక్షణలో ఉండేలా చూడాలని, హుండీకి భద్రత కల్పించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు నీటితో నిండిన డ్రమ్, మూడు బ్యాగుల ఇసుక సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు ప్రసారం చేయరాదని, మద్యం, పేకాట, పందాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వకూడదని తెలిపారు. మహిళలు, బాలికలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద కార్యక్రమాలను రాత్రి 10 గంటలలోపు ముగించాలని సూచించారు. మండపాల వద్ద డీజే లేదా డీజే తరహా శబ్ద వ్యవస్థలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**నిమజ్జన శోభాయాత్రలో జాగ్రత్తలు**

నిమజ్జనం రోజున వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకుని పూజలు, అలంకరణ పూర్తి చేసి నిర్ణయించిన మార్గంలోనే శోభాయాత్ర కొనసాగించాలని పోలీసులు సూచించారు. విగ్రహాన్ని తరలించే వాహనంపై చిన్నపిల్లలను ఎక్కించరాదని, మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించిన వ్యక్తులను ఊరేగింపులో పాల్గొనకుండా చూడాలని తెలిపారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాల వద్ద వివాదాస్పద వ్యాఖ్యలు, పాటలు, నృత్యాలు చేయరాదని, రంగులు చల్లరాదని సూచించారు. విద్యుత్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో విగ్రహాలను త్వరగా, సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు పోలీసులకు, నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ఎవరూ ముందుగా వెళ్లేందుకు పోటీ పడకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని, పోలీసులు, మైక్ ద్వారా చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కోరారు. భక్తి – భద్రత – క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని పోలీసులు పిలుపునిచ్చారు.





# గణేష్ మండపాల నిర్వాహకులకు హద్నూర్ పోలీసుల సూచనలు

**నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలి**

**భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎస్ఐ దోమ సుజిత్**

**న్యాల్కల్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని హద్నూర్ పోలీసులు సూచించారు. ఈ మేరకు ఎస్ఐ దోమ సుజిత్ ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణేష్ మండపం ఏర్పాటు చేసుకునే ముందు సంబంధిత పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండప నిర్మాణం పటిష్టంగా ఉండేలా చూసుకోవడంతో పాటు విద్యుత్ వైర్ల విషయంలో



అప్రమత్తంగా ఉండాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని, టపాసులు, మందుగుండు సామగ్రిని నిల్వ చేయరాదని హెచ్చరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదని, శబ్ద కాలుష్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్ఐ దోమ సుజిత్ కోరారు.



# కొత్తూరులో గంజాయి చాక్లెట్ల దందా గుట్టురట్టు

**వలస కార్మికులను లక్ష్యంగా విక్రయానికి యత్నం**

**భార్యాభర్తల అరెస్ట్.. 78 గంజాయి చాక్లెట్లు, మొబైల్ స్వాధీనం**

**కొత్తూరు, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** వలస కార్మికులను లక్ష్యంగా చేసుకుని గంజాయి కలిగిన చాక్లెట్లను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న భార్యాభర్తలను కొత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శు క్రవారం కొత్తూరులోని ఓ కల్లు కాంపౌండ్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న పురుషుడు, మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా వారు భార్యాభర్తలుగా తేలింది. బీహార్ రాష్ట్రం నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి వలస కార్మికులకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వారి వద్ద నుంచి 78 గంజాయి చాక్లెట్లు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# పశువుల వైద్యశాల స్థలంపై వివాదం

**కుల సంఘాల మధ్య స్థలం పంపకానికి ప్రయత్నాలంటూ ఆరోపణలు.**

**అధికారిక అనుమతులపై విచారణ జరపాలని స్థానికుల డిమాండ్.**

**దూలపల్లి, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** పశువుల వైద్యశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంపై దూలపల్లిలో వివాదం నెలకొంది. దూలపల్లి సర్వే నంబర్ 1లో గతంలో పశువుల వైద్యశాల కోసం సుమారు 500 గజాల స్థలాన్ని కేటాయించినట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం సంబంధిత అధికారుల సహకారంతో అక్కడ వైద్యశాల నిర్మాణం




చేపట్టినట్లు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం అదే స్థలాన్ని గౌడ సంఘం, యాదవ సంఘం మధ్య పంపకాలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మరో కుల సంఘానికి చెందిన నాయకుడు ఈ వ్యవహారాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లు కూడా చర్చ జరుగుతోంది. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలంపై ఇలాంటి ఆరోపణలు రావడంతో అధికారులు స్పందించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు. అసలు స్థలం ఎవరి ఆధీనంలో ఉంది? స్థలం పంపకాలకు ఏమైనా అధికారిక అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో మలిగే నరసింహారావు, సుధాకర్, గణేష్, మధు, వినయ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.




# బ్రిక్స్‌లో భారత్‌కు దౌత్య విజయం

**న్యూఢిల్లీ ప్రకటనకు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం**

**ఉగ్రవాదంపై కఠిన వైఖరి.. భద్రతా మండలి సంస్కరణలకు పిలుపు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** భారత్ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో న్యూఢిల్లీ ప్రకటనకు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రకటనకు ఏకాభిప్రాయం సాధించడం భారత్‌కు కీలక దౌత్య విజయంగా నిలిచింది. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ ప్రకటన ప్రతిబింబిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఏకపక్ష సుంకాల పెంపు, ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీసే చర్యలపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ఘర్షణలకు శాంతియుత, దౌత్యపరమైన పరిష్కారాలే మార్గమని బ్రిక్స్ స్పష్టం చేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని సభ్య దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ ఉపేక్షించబోమని పునరుద్ఘాటించాయి. ఖమారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నాయకత్వంలో జరిగిన ఈ సదస్సు 'మానవత్వమే ప్రథమం' అనే స్ఫూర్తితో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది.

# ఢిల్లీ బ్రిక్స్ సదస్సు వెనుక అసలు కథ.. పశ్చిమ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ సంకేతాలా?

**డాలర్‌ను కూల్చడం కాదు.. ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాల నిర్మాణమే లక్ష్యం**

**స్థానిక కరెన్సీల వినియోగం, గ్లోబల్ సౌత్ ప్రాతినిధ్యంపై పెరుగుతున్న దృష్టి**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** ఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. బ్రిక్స్ వెంటనే పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని దెబ్బతీస్తుందా? డాలర్ స్థానాన్ని భర్తీ చేయగలదా? అనే ప్రశ్నల కంటే.. అంతర్జాతీయ వ్యవస్థలో ప్రత్యామ్నాయ మార్గాలు ఎలా ఏర్పడుతున్నాయన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

**డాలర్‌కు ప్రత్యామ్నాయం.. ఇప్పుడే కాదు!**

బ్రిక్స్ దేశాల చర్చల్లో డాలర్‌ను ఒక్కసారిగా పక్కన పెట్టడం కంటే స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెంచడం, సరిహద్దు చెల్లింపులను సులభతరం చేయడం, సభ్య దేశాల చెల్లింపు వ్యవస్థలను అనుసంధానించడం వంటి అంశాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. దీంతో అంతర్జాతీయ లావాదేవీల్లో డాలర్‌పై ఆధారపడాల్సిన అవసరం కొంత తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్ కొత్త ఉమ్మడి కరెన్సీ కంటే స్థానిక కరెన్సీలు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థల అనుసంధానానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి.

**రష్యాకు పూర్తిగా దూరం కాలేని ప్రపంచం**

ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ.. రష్యా బ్రిక్స్ వేదికలో కొనసాగుతోంది. పుతిన్ పాల్గొనడం, భారత్‌తో రష్యా సంబంధాలు కొనసాగడం.. అంతర్జాతీయ రాజకీయాల్లో మాస్కో పూర్తిగా ఒంటరిగా మారలేదనే సంకేతాన్ని ఇస్తున్నాయి. అయితే బ్రిక్స్‌లోని అన్ని దేశాలు రష్యా విధానాలను సమర్థిస్తున్నాయని దీని అర్థం కాదు. ప్రతి దేశం తన స్వప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోంది.

**జీ7కు ప్రత్యామ్నాయ శక్తి కేంద్రంగా బ్రిక్స్?**

బ్రిక్స్ విస్తరించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రపై చర్చ పెరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో తమ ఆర్థిక బలం, జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగాలని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్రిక్స్‌ను కేవలం పశ్చిమ వ్యతిరేక కూటమిగా చూడటం కంటే.. ప్రపంచ నిర్ణయాల్లో గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యాన్ని పెంచే వేదికగా చూడటం సముచితమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కీలకం**

బ్రిక్స్ ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కూడా ఈ మార్పులో భాగమే. ఇది తక్షణమే ప్రపంచ బ్యాంకు లేదా అంతర్జాతీయ ద్రవ్య నిధికి ప్రత్యామ్నాయంగా మారే స్థాయిలో లేకపోయినా.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు పశ్చిమ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు వెలుపల రుణాలు, పెట్టుబడుల అవకాశాలను పెంచే ప్రయత్నంగా దీనిని చూడవచ్చు.

**బ్రిక్స్‌లో భారత్‌దే కీలక పాత్ర**

బ్రిక్స్‌లో భారత్ స్థానం ప్రత్యేకమైనది. ఒకవైపు అమెరికా, యూరప్ దేశాలతో వ్యూహాత్మక సంబంధాలను కొనసాగిస్తూనే.. మరోవైపు రష్యా, చైనా, గ్లోబల్ సౌత్ దేశాలతోనూ సంబంధాలను కొనసాగిస్తోంది. అందుకే బ్రిక్స్‌ను పూర్తిగా పశ్చిమ వ్యతిరేక వేదికగా మార్చే ప్రయత్నాలకు భారత్ దూరంగా ఉంటోంది. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, డిజిటల్ చెల్లింపుల అనుసంధానం వంటి ఆచరణాత్మక మార్గాలపై దృష్టి పెట్టడం భారత వ్యూహాత్మక సమతుల్యతకు నిదర్శనంగా కనిపిస్తోంది.

**పరిమితులు కూడా ఉన్నాయి**

బ్రిక్స్‌కు సవాళ్లు లేకపోలేదు. సభ్య దేశాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఒకేలా లేవు. భారత్--చైనా మధ్య వ్యూహాత్మక పోటీ కొనసాగుతోంది. ఒకే కరెన్సీ లేదా ఒకే ఆర్థిక విధానంతో నడిచే కూటమి బ్రిక్స్ కాదు. అందువల్ల బ్రిక్స్ రేపే జీ7 స్థానాన్ని భర్తీ చేస్తుందని లేదా డాలర్ ఆధిపత్యం ఒక్కసారిగా ముగుస్తుందని చెప్పడం తొందరపాటు. అయితే ప్రత్యామ్నాయ వాణిజ్య, ఆర్థిక వ్యవస్థలను నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నది మాత్రం విస్మరించలేని పరిణామం.

**అసలు మార్పు ఇదే..**

బ్రిక్స్ వెంటనే డాలర్‌ను కూల్చేస్తుందన్నది అసలు అంశం కాదు. పశ్చిమ దేశాల ఆధిపత్యంలో ఉన్న అంతర్జాతీయ వ్యవస్థలో ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పడుతున్నాయన్నదే ప్రధాన పరిణామం. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలు, అభివృద్ధి నిధుల వేదికలు, ఆంక్షల ప్రభావాన్ని తగ్గించే వాణిజ్య మార్గాలు, గ్లోబల్ సౌత్‌కు పెరుగుతున్న రాజకీయ ప్రాతినిధ్యం.. ఇవన్నీ కలిసి ప్రపంచాన్ని క్రమంగా బహుళ ధ్రువ వ్యవస్థ వైపు తీసుకెళ్లే అవకాశాన్ని పెంచుతున్నాయి. అందుకే ఢిల్లీ బ్రిక్స్ సదస్సు కేవలం మరో అంతర్జాతీయ సమావేశంగా కాకుండా.. మారుతున్న ప్రపంచ శక్తి సమీకరణాలకు ఒక కీలక సంకేతంగా అంతర్జాతీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిక్స్ కూటమి

ఢిల్లీ, సెప్టెంబర్ 12: ఏప్రిల్ 22, 2025న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పౌరుల ప్రాణాలను తీసిన భయంకరమైన ఉగ్రదాడిని బ్రిక్స్ కూటమి తీవ్రంగా ఖండించింది. ఏ విధమైన ఉగ్రవాదాన్నీ




సమర్థించలేమని పేర్కొంటూ.. తీవ్రవాదులు దేశ సరిహద్దులు దాటడం, ఉగ్ర నిధులు, వారికి లభించే సురక్షిత స్థావరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'లో ఆమోదించారు. చైనా మద్దతు – దౌత్య విజయం: పాకిస్థాన్‌కు నమ్మకమైన భాగస్వామిగా ఉన్న చైనా కూడా ఈ ఉగ్రవాద ఖండన తీర్మానంపై సంతకం చేయడం భారత్‌కు అంతర్జాతీయంగా పెద్ద దౌత్య విజయంగా మారింది. కీలకమైన మోదీ–జిన్‌పింగ్ భేటీ: 2020 సరిహద్దు వివాదాల తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య న్యూఢిల్లీ వేదికగా జరిగిన ద్వైపాక్షిక చర్చల నేపథ్యంలో ఈ డిక్లరేషన్‌కు మరింత ప్రాధాన్యం చేకూరింది.

# హరీశ్‌రావుపై పొంగులేటి సంచలన ఆరోపణలు..!

**వెలికట్టిలో 6.18 ఎకరాల అసైన్డ్ భూముల కొనుగోలు జరిగిందని ఆరోపణ**

**22-ఏ నిషేధిత జాబితా నుంచి భూములు ఎలా తొలగించారో తేల్చాలని డిమాండ్**



**మెయిన్ డెస్క్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సిద్ధిపేట జిల్లా వెలికట్టి గ్రామంలో హరీశ్‌రావు తన మామ పేరుతో 6.18 ఎకరాల భూములు కొనుగోలు చేశారని, అవి అసైన్డ్ భూములని ఆరోపించారు.అసైన్డ్ భూములకు బదలాయింపుపై నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత భూములు చేతులు మారడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని పొంగులేటి పేర్కొన్నారు. తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా భూములుగా మార్చుకున్నారని ఆయన ఆరోపించారు.వెలికట్టి ప్రాంతంలో ప్రస్తుతం ఎకరం భూమి విలువ సుమారు రూ.18 కోట్ల వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ భూమిని ఇద్దరి పేర్లపై కేటాయించినట్లు రికార్డుల్లో చూపించారనే ఆరోపణలు కూడా చేశారు.భూ రికార్డుల్లో జరిగిన మార్పులు, 22-ఏ జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ, సంబంధిత పత్రాల నమోదుపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని పొంగులేటి అన్నారు. ఎవరి ఆదేశాలతో రికార్డుల్లో మార్పులు జరిగాయి, నిషేధిత జాబితా నుంచి భూమిని ఎలా తొలగించారనే అంశాలను పరిశీలించాల్సి ఉందన్నారు.

# బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మిస్ ఇంగ్లాండ్ వ్యవహారంపై కేటీఆర్ ప్రశ్నలు

**అసెంబ్లీ వద్ద నిరసన నేపథ్యంలో కేసులు నమోదు చేయడంపై ఆగ్రహం**

**కాంగ్రెస్ నేతలపై వచ్చిన ఆరోపణలపై చర్యలేంటో చెప్పాలని డిమాండ్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద జరిగిన నిరసన సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేయడం చట్ట దుర్వినియోగమని ఆయన ఆరోపించారు. ఈ కేసులను న్యాయస్థానంలోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై ప్రశ్నలు**

గతంలో హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ కార్యక్రమం సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ చేసినట్లు పేర్కొంటున్న లైంగిక వేధింపుల ఆరోపణలను కేటీఆర్ ప్రస్తావించారు. ఆ వ్యవహారంలో పోలీసులు తీసుకున్న చర్యలపై డీజీపీని ప్రశ్నించారు.కాంగ్రెస్ నేతలపై వచ్చిన ఆరోపణల విషయంలో ఒక విధంగా, బీఆర్ఎస్ నేతలపై మరో విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

**రాహుల్ గాంధీకి సూటి ప్రశ్న**

ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై కాంగ్రెస్, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులపై న్యాయపరంగా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ ఆరోపణలపై ప్రభుత్వం, కాంగ్రెస్ నేతల స్పందన వెలువడాల్సి ఉంది.

# మోదీ–జిన్‌పింగ్ భేటీ.. సంబంధాల పునరుద్ధరణకు కీలక అడుగు

**సరిహద్దు సమస్యలు, ద్వైపాక్షిక వాణిజ్యంపై చర్చలు**

**పరస్పర సహకారంతో ముందుకు సాగుదామని ఇరుదేశాల నేతల స్పష్టత**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం ముఖాముఖి సమావేశమయ్యారు. గల్వాన్ సరిహద్దు ఘర్షణల తర్వాత భారత్‌లో ఇరువురు నేతలు సమావేశం కావడం ఇదే తొలిసారి కావడంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.ఇరుదేశాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న దౌత్యపరమైన విభేదాలు, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో మోదీ--జిన్‌పింగ్ భేటీ అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తించింది. ఇరువురు నేతలు ఆత్మీయంగా కరచాలనం చేసుకుని చర్చలు ప్రారంభించారు.భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అందించిన సహకారానికి మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు భవిష్యత్ ప్రణాళికలపై చర్చించేందుకు ద్వైపాక్షిక వేదిక అనుకూల అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు.చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా సానుకూలంగా స్పందిస్తూ.. భారత్, చైనాలు పరస్పర బలాలను గుర్తించి సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. రెండు దేశాల అంతర్గత పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పటికీ పరస్పర సహకారం ద్వారా అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను సాధించవచ్చని తెలిపారు.సరిహద్దు భద్రత, ద్వైపాక్షిక వాణిజ్యం సహా కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. ఈ భేటీతో భారత్--చైనా సంబంధాల్లో కొత్త దశకు నాంది పలుకుతుందా అన్న అంశంపై అంతర్జాతీయంగా చర్చ సాగుతోంది.

# పాకిస్తాన్ కలలకు మోదీ సర్కార్ చెక్?

**బ్రిక్స్‌లో పాకిస్తాన్‌కు మళ్లీ నిరాశ..**

**భారత్ అభ్యంతరంతో సభ్యత్వానికి బ్రేక్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక కూటమిగా ఎదుగుతున్న బ్రిక్స్‌లో సభ్యత్వం పొందాలన్న పాకిస్తాన్ ప్రయత్నాలకు ఇప్పటికీ ఫలితం దక్కలేదు. 2023లోనే పాకిస్తాన్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, భారత్ అభ్యంతరం కారణంగా ప్రతిపాదన ముందుకు సాగడం లేదని సమాచారం.బ్రిక్స్‌లో కొత్త దేశాన్ని చేర్చాలంటే సభ్యదేశాలన్నింటి ఏకగ్రీవ ఆమోదం అవసరం. పాకిస్తాన్ సభ్యత్వానికి చైనా, రష్యా మద్దతు ఉన్నప్పటికీ భారత్ నుంచి అనుకూలత లభించకపోవడంతో ఆ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న పాకిస్తాన్‌కు బ్రిక్స్ సభ్యత్వం కీలకంగా మారింది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు ప్రత్యామ్నాయ ఆర్థిక అవకాశాలను పొందేందుకు బ్రిక్స్ వేదిక ఉపయోగపడుతుందని పాకిస్తాన్ భావిస్తోంది.బ్రిక్స్ ఆధ్వర్యంలోని నూతన అభివృద్ధి బ్యాంకులో వాటాలు కొనుగోలు చేయడం ద్వారా కూడా ఆర్థిక సహకారాన్ని పెంచుకునేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. సభ్యత్వం కోసం రష్యాలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయం, విదేశాంగ శాఖ ప్రతినిధులు దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ.. భారత్ వైఖరి కారణంగా ఇప్పటివరకు పురోగతి కనిపించడం లేదు.ఈ నేపథ్యంలో బ్రిక్స్‌లో పాకిస్తాన్‌కు తలుపులు ఎప్పుడు తెరుచుకుంటాయన్నది అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది.

# ఇండియా–చైనా ఒక్కటైతే.. ప్రపంచం వినాల్సిందే!

**బ్రిక్స్ వేదికగా మోదీ-జిన్‌పింగ్ కీలక భేటీ**

**సరిహద్దులో శాంతి.. వాణిజ్యం,**

**పెట్టుబడులు, ద్వైపాక్షిక సహకారంపై దృష్టి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** ఆసియాలోని రెండు ప్రధాన శక్తులు భారత్, చైనా మరోసారి దౌత్య చర్చల బాట పట్టాయి. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ అయ్యారు. 2020లో లడఖ్ సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత దెబ్బతిన్న సంబంధాలను క్రమంగా మెరుగుపరుచుకునే ప్రయత్నాల్లో ఈ భేటీ కీలక ఘట్టంగా నిలిచింది.ఇరుదేశాల మధ్య విభేదాలు వివాదాలుగా మారకూడదని మోదీ, జిన్‌పింగ్ స్పష్టం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అత్యంత కీలకమని మోదీ పేర్కొన్నారు. సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, సహేతుకమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం ముందుకు సాగాలని ఇరువురు నేతలు అంగీకరించారు.వాణిజ్య అసమతుల్యత, సరఫరా వ్యవస్థలు, మార్కెట్ ప్రాప్యత, వ్యాపార సంబంధాలు వంటి అంశాలపైనా చర్చ జరిగింది. ప్రజల మధ్య సంబంధాలు, సాంస్కృతిక మార్పిడి, వ్యాపార సంబంధాలు, రాకపోకలను మరింత సులభతరం చేయాల్సిన అవసరాన్ని నేతలు గుర్తించారు.ప్రపంచ రాజకీయాల్లో భారత్, చైనా రెండూ కీలక శక్తులుగా ఉన్నాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడితే దాని ప్రభావం ఆసియా ప్రాంతంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, దౌత్య సమీకరణాలపై కూడా కనిపించే అవకాశం ఉంది. అయితే సరిహద్దు వివాదాలు, వాణిజ్య లోటు, వ్యూహాత్మక అనుమానాలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు.బ్రిక్స్ వేదికపై భారత్-చైనా సహకారం పెరగడం ప్రపంచ దక్షిణ దేశాల సమన్వయానికి కూడా ప్రాధాన్యం సంతరించుకోనుంది. అయితే తాజా భేటీని సంబంధాల పూర్తి సాధారణీకరణగా కాకుండా, పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించే దిశగా మరో కీలక అడుగుగా చూడాల్సి ఉంటుందని విశ్లేషణలు సూచిస్తున్నాయి.



## హైదరాబాద్ వాసులకు ట్రాఫిక్ అలర్ట్..

# ఖైరతాబాద్‌లో ఆంక్షలు!

**బడా గణేష్ దర్శనానికి భారీగా భక్తుల రాక**

**సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు కీలక మార్గాల్లో ఆంక్షలు.. ప్రత్యామ్నాయ దారులు ఎంచుకోవాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రద్దీని నియంత్రించేందుకు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాజా పోలీసు ప్రకటన ప్రకారం కొన్ని మళ్లింపులు సెప్టెంబర్ 12 రాత్రి నుంచే అమల్లోకి రానున్నాయి.ఖైరతాబాద్, శాదన్ కళాశాల, అయోధ్య, నిరంకారి, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, మింట్ కాంపౌండ్, ఎన్టీఆర్ మార్గ్, సచివాలయ జంక్షన్, నెక్లెస్ రోటరీ, కేఎన్‌పీ జంక్షన్, మాసాబ్‌ట్యాంక్ ప్రాంతాల్లో రద్దీ పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అత్యవసరం కాని ప్రయాణాలను ఈ మార్గాల్లో తగ్గించుకోవాలని సూచించారు.బడా గణేష్ దర్శనానికి వచ్చే భక్తులు వ్యక్తిగత వాహనాల కంటే ప్రజా రవాణాను వినియోగించుకోవాలని పోలీసులు కోరారు. మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్ సేవలను వినియోగించుకోవడం ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చని సూచించారు.భక్తుల వాహనాల కోసం ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ స్థలం, ఎన్టీఆర్ గార్డెన్స్, ఎన్టీఆర్ ఘాట్, రేస్ కోర్స్ తదితర ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే భక్తులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.వారాంతాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున వీలైనంత వరకు సోమవారం నుంచి శుక్రవారం మధ్య దర్శనానికి రావాలని పోలీసులు సూచించారు. ఉదయం వేళల్లో



దర్శనం పూర్తి చేసుకోవడం ద్వారా సాయంత్రం రద్దీని నివారించవచ్చని తెలిపారు.భక్తులు, నగరవాసులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజ్వల్ రేవణ్ణ జైలు ఫోన్‌లో అశ్లీల వీడియోలు


**ఫోరెన్సిక్ పరిశీలనలో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలు**

**అక్రమంగా జైలులోకి చేరిన ఫోన్, సిమ్‌పై కొనసాగుతున్న దర్యాప్తు**

**బెంగళూరు, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** లైంగిక దాడి కేసులో దోషిగా తేలి జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన మొబైల్ ఫోన్‌లో పలు అశ్లీల వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ పరిశీలనలో వెల్లడైంది. బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో స్వాధీనం చేసుకున్న ఫోన్‌ను పరిశీలించిన అనంతరం ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

**జైలులోనే అక్రమ ఫోన్ వినియోగం**

ఆగస్టు 11న జైలు భద్రతా విభాగంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా



ప్రజ్వల్ రేవణ్ణ ఉన్న బారక్ నుంచి మొబైల్ ఫోన్, సిమ్ కార్డు, చార్జర్, నోట్‌బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని ఫోరెన్సిక్ పరిశీలనకు పంపారు. ఫోన్‌లో పలు అశ్లీల వీడియోలు, పెన్‌డ్రైవ్‌లో సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**ఫోన్ ఎలా చేరింది?**

జైలులోకి మొబైల్ ఫోన్, సిమ్ కార్డు ఎలా చేరాయన్న అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో జైలు సిబ్బంది సహకారం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. ఫోన్, సిమ్ కార్డు సరఫరాకు సంబంధించి పలువురిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు తాజా సమాచారం. అయితే ఫోన్ తనదేనన్న విషయాన్ని ప్రజ్వల్ రేవణ్ణ ప్రశ్నించిన సమయంలో తిరస్కరించినట్లు పోలీసులు తెలిపారు. ఇతర ఖైదీలు కూడా ఆ ఫోన్‌ను ఉపయోగించేవారని, వీడియోలను తాను డౌన్‌లోడ్ చేయలేదని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఈ అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

**జైలు భద్రతపై ప్రశ్నలు**

మాజీ ఎంపీ వద్ద నిషేధిత మొబైల్ ఫోన్ లభించడం, అందులో అభ్యంతరకర వీడియోలు బయటపడటం జైలు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. ఫోన్ వినియోగం వెనుక ఉన్న నెట్‌వర్క్, ఇతరుల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**మత సామరస్యాన్ని కాపాడుతూ వేడుకలు జరుపుకోవాలి: ఎస్పీ పరితోష్ పంకజ్**

**మండపాల ఏర్పాటుకు పోలీసులకు ముందస్తు సమాచారం తప్పనిసరి.. డీజేలకు అనుమతి లేదు**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. వివిధ కులాలు, మతాలకు చెందిన పెద్దలతో సంగారెడ్డి జెడ్పీ హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం బలపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా పాటలు, వ్యాఖ్యలు చేయవద్దని, యువత తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా, అలాంటి సందేశాలను ఇతరులకు పంపవద్దని హెచ్చరించారు.

**మండపాలకు ముందస్తు సమాచారం**

గణేష్ మండపాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు తెలంగాణ పోలీస్ పోర్టల్ ద్వారా ముందస్తు సమాచారం తప్పనిసరిగా అందించాలని ఎస్పీ సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జనానికి వెళ్లే మార్గం తదితర వివరాలను నమోదు చేయాలని తెలిపారు. మండపాలను రహదారులు, కాలిబాటలు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే ప్రదేశాల్లో ఏర్పాటు చేయరాదన్నారు. భక్తుల వాహనాల కోసం తగిన దూరంలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**డీజేలకు అనుమతి లేదు**



మండపాల వద్ద అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా మైకులు, స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మండప నిర్వాహకులతో పాటు సంబంధిత డీజే యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రార్థనా మందిరాల సమీపంలో అధిక శబ్దంతో ధ్వనివ్యవస్థలు ఏర్పాటు చేయరాదన్నారు. ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు, పాటలు ప్రసారం చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

**భద్రతపై ప్రత్యేక దృష్టి**

ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రివేళ కనీసం ఇద్దరు లేదా ముగ్గురు స్వచ్ఛంద సేవకులు పర్యవేక్షణలో ఉండేలా చూసుకోవాలని ఎస్పీ తెలిపారు. మండపాల వద్ద టపాకాయలు, మందుగుండు సామగ్రి నిల్వ చేయరాదని సూచించారు. విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇసుక బస్తాలు, నీటి



డ్రమ్ములు, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండపాల వద్ద బలవంతంగా చందాలు వసూలు చేయడం, లక్కీ డ్రాలు నిర్వహించడం, మత్తు పదార్థాలు సేవించడం, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని స్పష్టం చేశారు.


**మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం**

పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. భారీ విగ్రహాల కారణంగా నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున సాధ్యమైనంతవరకు విగ్రహాల పరిమాణంలో పరిమితులు పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్–112కు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వివిధ మతాల పెద్దలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్, మున్సిపల్ కౌన్సిలర్ కూన సంతోష్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ప్రతినిధులు, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్ కుమార్, వివిధ కుల, మతాల పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు

## : జగన్ కు నారా లోకేశ్ హితవు

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ–2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ



అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# లైంగిక వేధింపుల కేసులో 'ఢీ-10' విజేత రాజు అరెస్ట్

**సినిమా అవకాశాల పేరుతో మోసం చేశారంటూ యువతి ఫిర్యాదు**

**మియాపూర్ పోలీసులు కేసు నమోదు.. కోర్టు రిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (హైదరాబాద్ పల్స్):** ప్రముఖ నృత్య కార్యక్రమం 'ఢీ' ద్వారా గుర్తింపు పొందిన నృత్య కళాకారుడు రాజును మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశారనే ఆరోపణలను కూడా యువతి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నెల 9న యువతి మియాపూర్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించిన నేపథ్యంలో రాజును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించడంతో ప్రస్తుతం జైలులో ఉన్నట్లు సమాచారం. రాజుపై వచ్చిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. 'ఢీ–10' విజేతగా గుర్తింపు పొందిన రాజు అరెస్ట్ కావడం బుల్లితెర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి: ప్రధాని మోదీ




సహకార స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మరింత సమ్మిళితమైన, సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు బ్రిక్స్ సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం ప్రారంభమైన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యతకు, ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ వేదిక నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు ఇతర సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు ప్రధాని మోదీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నేతలందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని సామూహిక చిత్రానికి (గ్రూప్ ఫొటో) పోజులిచ్చి, తమ ఐక్యతను చాటిచెప్పారు. సదస్సులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికతను బలోపేతం చేయడం' అనే అంశంపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు ప్రత్యేక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "ఈ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను సత్ఫలితాలుగా మార్చడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

